# పసుపు కొనుగోళ్లపై కేంద్రం-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం

## బహిరంగ వేలంతో రైతులకు నష్టం – దళారులకు లాభం

## రైతులను ముంచే బహిరంగ వేలాన్ని వెంటనే నిలిపివేయాలి

## లోపాలను సవరించి ఈ- నామ్ విదానం లోనే పసుపు కొనుగోళ్లు చేపట్టాలి

## పసుపు కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను అరికట్టాలి.

## మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ:పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఈ పసుపు కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఈ-నామ్ విధానం ద్వారా కాకుండా బహిరంగ వేలం ద్వారా పసుపు కొనుగోళ్లు జరగడం వల్ల రైతులు మద్దతు ధర పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఈ నేపథ్యంలో రైతులు నిజామాబాద్ గంజ్‌లో ధర్నా నిర్వహించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పసుపు రైతులు పంట అమ్ముకోవడంలో పడుతున్న ఇబ్బందులను తొలగించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. మార్కెట్ యార్డ్‌కు భారీగా పసుపు పంట వచ్చినప్పటికీ, ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని అన్నారు. దీంతో రైతులు తమ పంట అమ్ముకోవడానికి మూడు నాలుగు రోజుల పాటు మార్కెట్ యార్డ్‌లో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. ఇక్కడ బీజేపీ ఎంపీగా అరవింద్ , జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ ఉండి కుడా లాభం లేకుండా పోయిందన్నారు.

పసుపు రైతులకు ఇబ్బందులు తప్పటం లేదని, ఇటీవల ఎంపీ అరవింద్ "ఈ-నామ్ 1.50" కింద కొనుగోళ్లు ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికి కార్యరూపం దాల్చలేదని , సాంకేతిక సమస్యలు ఉన్నాయని చెప్పి కొనుగోళ్లు నిలిపివేసి బహిరంగ వేలం నిర్వహించడం అన్యాయమని ఆయన అన్నారు.మొదట "ఈ-నామ్ 2.50" గురించి మాట్లాడి, తర్వాత "1.50" అని చెప్పడం రైతుల్లో గందరగోళం సృష్టించిందని విమర్శించారు.

ప్రస్తుతం మార్కెట్‌లో పరిస్థితి దారుణంగా మారిందని, చాపల మార్కెట్‌ల మాదిరిగా బహిరంగ వేలం ద్వారా దళారులు కుమ్మక్కై తక్కువ ధరలకు పసుపు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు.

పారదర్శకత లేకుండా బహిరంగ వేలం నిర్వహించడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని, దళారులకు లాభం చేకూరుతోందని ఆయన తప్పుపట్టారు. మార్కెట్ యార్డ్‌కు పసుపు తీసుకువచ్చిన రైతులు రోజుల తరబడి సరైన ధర కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. దళారులు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేసే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ఈ నామ్ లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఈ నామ్ ద్వారా పసుపు కొనుగోళ్లు చేయాలని బహిరంగ వేలం నిలిపివేయాలన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించి పసుపు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.పోరాటం చేస్తున్న పసుపు రైతులకు బీయర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, రైతుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడతామని, సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు



చేపడతామని ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.ఖ

# ప్రజల్లో మార్పు రానంత వరకు ప్రమాదాలను నివారించలేం

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## మంత్రి పొన్నంకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ, జిల్లా అధికారులు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజలలో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజామాబాద్ నగర పర్యటనకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పాటు అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకారి యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, సుడా ఛైర్మన్ కేశ వేణు, ఇతర జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా మంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులతో పాటు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతీ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములు అయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని రహ్ వీర్ కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం ద్వారా అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలి

## ఎస్సై అనిల్ రెడ్డి





కమ్మర్ పల్లి, బతుకమ్మ :ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాధాల నివారణకు సహకరించాలని కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలను ఎస్సై అనిల్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ ఆలీవ్ క్యాంపెయిన్ 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని హైస్కూల్లల్లో చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే ను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని కమ్మర్ పల్లి, చౌట్ పల్లి, ఉప్పులూర్, హాసకొత్తూరు, బషీరాబాద్, కొనాసముందర్, కొనాపూర్ గవర్నమెంట్ హై స్కూల్లల్లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ పై అవేర్నస్ ప్రోగ్రాంను చేపట్టి పోలీసులు డెమో ద్వారా వివరించారు. ఈ సందర్బంగా విద్యార్థులతో వారి వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, స్పీడ్ డ్రైవింగ్ చేయొద్దని, హెల్మెంట్, సీట్ బెల్ట్ వాడాలని , మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ చేయవద్దని తదితర అంశాలపై వివరణ రాస్తూ, నాన్న దయచేసి మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, నాకోసం, మా అమ్మ కోసం, మనందరికోసం ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరుతూ విద్యార్థుల తండ్రులకు భావోద్వేగ భరితమైన, సూటి అయిన సందేశాలతో విద్యార్థులతో పోస్ట్ కార్డులను పంపింపజేశారు.ఈ వినూత్న కార్యక్రమం నిర్వహణలో భాగంగా ఆయా స్కూళ్ళల్లో విద్యార్థులతో మానవహారం నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెద్దల్లో మార్పు తీసుకురావడానికే ఈ పోస్ట్ కార్డ్ ల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మద్యం త్రాగి వాహనం నడపడం, స్కూల్ వద్దు స్పీడ్ గా నడపడం, మైనర్లకు వాహనాలను ఇవ్వడం వంటి విషయాలపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాఠశాలల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

